ఎస్సీ శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి

శ్మశాన వాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నరసింహారెడ్డి

మన్సూరాబాద్, మే 25: అసంపూర్తిగా పనులు చేపట్టిన ఎస్సీ శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధి కుంట్లూర్ రోడ్డులో ఉన్న ఎస్సీ శ్మశాన వాటికను ఆదివారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి పరిశీలించారు. శ్మశాన వాటిక అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శ్మశాన వాటికలో స్నానపు గదులు, నీటి సౌకర్యం, మూత్రశాలలు, మెయిన్ గేట్, హైమాస్ట్ లైట్లు, విద్యుత్ దహన శాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అసంపూర్తిగా ఉన్న పనుల ప్రతిపాదనలను సిద్ధం చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కోదండ సూరి, సత్యనారాయణ, లక్ష్మి దాస్, లక్ష్మి నర్సిం, జంగయ్య, ముత్యాలు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సుభాకర్ రావు

ఆర్కే పురం, మే 25 వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం కాలనీలోని ఆధ్యాత్మిక కేంద్రంలో నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో 2025-2028 గాను వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, లక్ష్మయ్య, మనోహర్ రావు, ప్రధాన కార్యదర్శిగా అయితే అంజయ్య గుప్తా, జాయింట్ సెక్రటరీలుగా గౌరీ శంకర్, రామకృష్ణ, సిద్ధార్థ, కోశాధికారిగా కృష్ణయ్య, జాయింట్ ట్రెజరీగా దండు రాజు, ఈసీ మెంబర్స్ గా చిలుక ఉపేందర్ రెడ్డి, బాలరాజు, జయరాం, కళ్యాణ్, లచ్చన్న, మల్లారెడ్డి, మల్లికార్జున రావు, ప్రకాశ్ రావు, ప్రసాద్, రామయ్య తో పాటు పదిమంది ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సుభాకర్ రావు నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసినట్లు తెలిపారు. కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజా ప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశామన్నారు.

అన్ని వర్గాలకు అండగా ఉంటా

- ఎరుకల కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తా
- అలయ్ బలయ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎరుకల సామాజిక వర్గం అలయ్, బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

చంపాపేట,మే 25: ఎరుకల సామాజిక వర్గ ప్రజలకు తన వంతు ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆదివారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ కొత్త కాపు యాదవ రెడ్డి గార్డెన్ లో తెలుగు రాష్ట్రాల ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల ఎరుకల సామాజిక వర్గ ప్రజలు అలయ్, బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని తనను కలిసిన ఎరుకల సామాజిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఆ సామాజిక వర్గం అభివృద్ధికి కృషి చేస్తానని వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నల్లగొండ శ్రీనివాస్, వెలుగు నాగార్జున, శేఖర్, శ్యామల, రాజు, వెంకట్రా ములు, జగదీశ్, వెంకటయ్య పాల్గొన్నారు

మోహన్‌నగర్ లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

కార్యకర్తలు ఐక్యంగా ఉండాలి..

మన్సూరాబాద్: పార్టీ అభివృద్ధి కోసం పనిచేసే వారికి ఏదో ఒక సమయంలో సముచిత స్థానం దక్కుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్వీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండుగౌడ్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ పరిధి మోహన్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ ఎస్ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఐక్యతతో ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కొత్తపేట డివిజన్‌లో పార్టీ ఎంతో బలోపేతంగా ఉందని తెలిపారు. ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టే విధంగా నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి ఎండీ జహీర్ ఖాన్, కొత్తపేట డివిజన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ లింగాల రాహుల్ గౌడ్, నాయకులు పులికంటి వెంకట్, మల్లె పాక యాదగిరి, భాస్కర్, సచిన్, ఉదయ్ పాల్గొన్నారు.

25 ఏండ్ల తర్వాత ..

కందుకూరు, మే 25 : 25 ఏళ్ల తర్వాత స్నేహితులంతా ఒక్క దగ్గర కలుసుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఎంజాయ్ చేస్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కందుకూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో1999 -2000 ల విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో ఒకే చోట చేరారు. ఉపాధ్యాయులను ఆహ్వానించి సిల్వర్‌జూబ్లీ నిర్వహించారు. అలనాడు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రాఘవాచారి , పెంటయ్య, లక్ష్మారెడ్డి , వెంకటయ్య , సుదర్శన్ రెడ్డి, అయ్యూబ్,ఆనంద్‌లను సన్మానించారు. అంతకు ముందు విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రోజంతా స్నేహితులతో కలిసి సంతోషంగా గడిపారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసిన పెండ్యాల ఎస్సీ సంఘం నాయకులు

బడంగ్ పేట్, మే 25: మహేశ్వరం మండలం పరిధిలోని పెండ్యాల్ గ్రామం మాజీ సర్పంచ్ మంత్రి రాజేశ్ ఆధ్వర్యంలో పెండ్యాల్ ఎస్సీ సంఘం అధ్యక్షుడు యాచారం నరసింహ, కమిటీ నాయకులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పెండ్యాల్ ఎస్సీ కమిటీ హాల్ నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. తప్పకుండా కమ్యూనిటీ హాల్ ను కట్టిస్తానని మాట ఇచ్చారని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇస్తానందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యాచారం దశరథ, రవీందర్ , నర్సింగ్ రావు, ముత్యం , తొంట శ్రీకాంత్, సుమన్, గణేశ్, సత్య అశోక్ రెడ్డి, నరేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీసీల హక్కుల కోసం పోరాడుతా

మన్సూరాబాద్, మే 25: ఎల్బీనగర్ కు చెందిన సామాజిక కార్యకర్త, డాక్టర్ వీరభోగ వసంతరాయలు తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్‌లో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ వసంతరాయలుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ వైద్యులు, సామాజిక కార్యకర్త, డాక్టర్ వీరభోగ వసంతరాయలు బీసీల హక్కుల సాధన కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంత రాయలు మాట్లాడుతూ బీసీ కులాలను ఐక్యం చేసి వారి హక్కుల కోసం పోరాటం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి భాస్కరుడు, కోశాధికారి పసుపులేటి కర్ణాకర్, ఉపాధ్యక్షులు రాణా నాగేశ్ సింగ్, సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గోగుల స్వామి, ఎల్బీ నగర్ నియోజకవర్గం సభ్యులు దీకొండ గోపాల్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జూన్ 6 నుంచి ఎల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

అంబర్‌పేట, మే 25 : వచ్చే నెల జూన్ 6 నుంచి 8 వ తేదీ వరకు మూడు రోజుల పాటు అంబర్‌పేట, శంకర్‌నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ ముత్యాలమ్మ, నల్లపోచమ్మ దేవతా మూర్తుల విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు కమిటీ చైర్మన్ రావుల ప్రదీప్, అధ్యక్షుడు ఎ.బ్రహ్మచారి, గౌరవాధ్యక్షుడు శివరామకృష్ణ(రాజు), ప్రధాన కార్యదర్శి టి.సతీశ్, కోశాధికారి ఇ. పూర్ణచందర్, ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ గుప్త, ఆర్గనైసింగ్ సెక్రటరీలు కచ్చిగళ్ల శ్రీనివాస్, మురళీకుమార్, జాయింట్ సెక్రటరీ ఆనంద్, సభ్యులు బల్‌దేవ్‌సింగ్, ప్ర తాప్ రెడ్డి, దీపు, బస్తీ పెద్దలు శ్రీహరి, జయరాములు, నర్సింలు, యాదయ్యగౌడ్ తదితరులు విగ్రహ ప్రతిష్టాపన వివరాలపు ఆదివారం మీడియాకు తెలిపారు. జూన్ 6వ తేదీ ఉదయం 9 గంటలకు ఊరేగింపు, సాయంత్రం 5.30కు గణపతిపూజ, 7న ఉదయం 8 గంటల నుంచి శాంతి పాఠము, మూలమంత్ర హోమాలు, 8వ తేదీన ఆదివారం ఉదయం 7 గంటల నుంచి శాంతి పాఠం, హోమం, మహాపూర్ణాహుతి, మహా కుంభ సంప్రోక్షణ, రేణుక ఎల్లమ్మ(జమదగ్ని) శాంతి కల్యాణం ఉంటుందన్నారు

వీరన్నగుట్ట కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

పార్క్ అభివృద్ధికి ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు రఘువీర్ రెడ్డి

మన్సూరాబాద్, మే 25: ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి సహకారంతో వీరన్న గుట్ట కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధి వీరన్న గుట్ట కాలనీలో పార్క్ స్థలం అభివృద్ధి కోసం జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 30 వేల చెక్కును ఆయన కాలనీవాసులకు అందజేశారు. ఈ సందర్భంగా జక్కిడి రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ వీరన్న గుట్ట కాలనీలోని పార్కును ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. అనంతరం కాలనీవాసులతో కలిసి పరిసర ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న యూజీడీ ట్రంక్ లైన్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కార్డులతో ఆరోగ్య భద్రత

ఆయుష్మాన్ కార్డులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఏవీఆర్ మూర్తి

ఆర్కే పురం, మే 25 : కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండటం కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డు ఎంతో ఉపయుక్తమైనదని బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ ఏవీఆర్ మూర్తి అన్నారు. ఆదివారం దిల్‌సుఖ్‌నగర్ లోని కమలానగర్ రామాలయం ప్రాంగణంలో బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ కార్డును ప్రతి ఒక్క బ్రాహ్మణుడు డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని అందుకోసం బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రత్యేకంగా ఈ కార్డులను డౌన్‌లోడ్ చేసి ఉచితంగా అందిస్తోందన్నారు. సుమారుగా 150 మందికి పైగా పాల్గొని కార్డు పొందినారని ఈ కార్డు ద్వారా దేశంలోని వివిధ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సను పొందే అవకాశం ఉందని ఐదు లక్షల వరకు వైద్య ఖర్చులకు ఈ కార్డు ఉపకరిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి సోమేశ్వరులు, కార్యవర్గ సభ్యులు మోహనా చార్య, సరళ, పోపూరి శ్రీనివాస్, విజయభాస్కర్, ఏక శిరీష, అనిత, ఎస్ ఎస్ ఎన్ మూర్తి, వేమూరి ఆనంద్, మురళి, సురేశ్ పాల్గొన్నారు.

అజంతా రైల్లో స్నాచింగ్

కాచిగూడ, మే 25: అజంతా రైల్లో దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. వెస్ట్ గోదావరి కి చెంది కె.అనంతలక్ష్మి(53) అజంతా రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గ మధ్య ఔరంగాబాద్ రైల్వే స్టేషన్‌లో అనంతలక్ష్మి మెడ లో ఉన్న 31 గ్రాముల బంగారు చైన్‌ను గుర్తుతెలియని దుండగులు గొంగిలించారు. బాధితురాలు ఆదివారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం ఔరంగాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దుచేయాలి

మానవహారంలో పాల్గొన్న మలక్ పేట ఎమ్మెల్యే బలాల, తదితరులు

సైదాబాద్ మే 25: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆదివారం మధ్యాహ్నం మానవహారం నిర్వహించారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు కమిటీ, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ,మత పెద్దలు, ఇస్లామియా పండితులు మజ్లిస్‌పార్టీ (ఎంఐఎం)ఇచ్చిన పిలుపుమేరకు డబీర్‌పుర బ్రిడ్జి నుంచి మలక్ పేట్ వరకు, సైదాబాద్ నుంచి చంచల్ గూడ జైలు చౌరస్తా వరకు మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చివక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నల్ల జెండాలు, ప్ల కార్డులతో మానవహారాన్ని నిర్వహించామని తెలిపారు. మనవహారం కార్యక్రమానికి యువకులు చిన్నారులు పెద్ద ఎత్తున తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మౌలానా సయ్యద్, మసూద్ హుస్సేన్, ముర్తుజా, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని జింక మృతి



కందుకూరు, మే 25: రోడ్డు ప్రమాదంలో జింక మృతి చెందింది. హైదరాబాద్ శ్రీశైలం రహదారి పై మండల పరిధిలోని రాచులూరు గేటు సమీపంలో గల పెద్దమ్మ గుడి వద్ద వాహనం ఢీకొట్టింది. సమాచారం అందుకున్న గుమ్మడ వెల్లి ఫారెస్ట్ ఆఫీసర్ విజయ భాస్కర్ రెడ్డి, సంఘటనా స్థలానికి చేరుకొని రాచులూరు పశువైద్యాధికారి షాహిన్ షేక్‌కు సమాచారం అందజేసి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పోస్టుమార్టం చేసి ఫారెస్ట్ ఆఫీసర్‌కు అప్పగించారు. అనంతరం ఫారెస్ట్ ఆఫీసర్ విజయ భాస్కర్ రెడ్డి, గుమ్మడవెల్లి ఫారెస్ట్ భూమిలో పూడ్చిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంట వెళ్లే వాహనాలు ఫారెస్ట్ లో ఉన్నచోట నిదానంగా వెళ్లాలని సూచించారు. ప్రమాదం జరిగిన చోట సీసీ కెమెరాలు ఉన్నట్లయితే వాటిని పరిశీలించి వాహనాన్ని గుర్తిస్తామని పేర్కొన్నారు.

'ఇందిరమ్మ' ఎంపికలో గందరగోళం

కాంగ్రెస్ కార్యకర్తలకే కేటాయింపు

- అయోమయంలో లబ్ధిదారులు
- నిజమైన పేదలకు మొండిచెయ్యి
- పారదర్శకత పాటించని అధికారులు

బడంగ్ పేట్, మే 25: మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా 3,393 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించారు. ఇన్‌చార్జి మంత్రి 2,507 మందిని సెలెక్ట్ చేశారు. అందులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 2,448 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. లబ్ధిదారులకు పత్రాలు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపికలో అవకతవకలు జరిగినట్లు మహేశ్వరం నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ నాయకులే ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను అందజేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గంలో ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, పెద్ద పెద్ద భవనాలు ఉన్నవారిని కేటాయించారని ఇప్పటికే చాలామంది పేర్లతో సహా ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

కలెక్టర్ ఎంపిక చేసిన జాబితా..

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 321 మంది, జల్ పల్లి మున్సిపాలిటీలో 262 మంది, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 117 మంది, తుక్కుగూడ మున్సిపాలిటీలో 200, కందుకూరులో 971, మహేశ్వరానికి 576 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు.

ఇన్‌చార్జి మంత్రి సెలెక్ట్ చేసినవి..

బడంగ్ పేట్‌కు 198, జల్‌పల్లి మున్సిపాలిటీకి 118, మీర్‌పేట్ మున్సిపాలిటీకి 121, తుక్కుగూడ మున్సిపాలిటీకి 200, కందుకూరుకు 1017, మహేశ్వరంకు 853 కేటాయించారు.

ఎంపిక లోపభూయిష్టం..

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక లోప భూయిష్టంగా మారింది. కాంగ్రెస్ నాయకులు ఎంపిక చేసిన వారికే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించినట్లు ఆరోపణలు వినిస్తున్నాయి. లబ్ధిదారులు ఎంపిక చేయడానికి ఏర్పాటు చేసిన కమిటీకి సంబంధం లేకుండానే ఎంపిక జరిగిపోయినట్లు విమర్శలు వస్తున్నాయి. మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా 2448 మంది ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయగా అందులో 25శాతం కూడా అర్హులు లేరన్న వాదనలు బలంగా వినిపిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు దక్కాయి తప్ప నిజమైన పేదలను విస్మరించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు సైతం అధికార పార్టీ నేతలకే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

ధనికులకే ఇందిరమ్మ ఇండ్లు..

పేదలను విస్మరించి ధనికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారన్న ఆరోపణలు వస్తున్నాయి. బహుళ అంతస్తులు ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ ఉద్యోగులకు, బహుళ అంతస్తులు ఇల్లు ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఇందిరమ్మ ఇల్లు కట్ట బెట్టడంపై స్థానికంగా చర్చనీయంశంగా మారింది. మాజీ కార్పొరేటర్లు చెప్పిన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారన్న విమర్శలు ఉన్నాయి. అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక లోపభూయిష్టంగా ఉందని బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం నాయకులు ఆరోపిస్తున్నారు.

రద్దు చేస్తాం

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని అధికారులకు గైడెన్స్ ఇచ్చాం. 200 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఒక గెజిటెడ్ ఆఫీసర్‌ను కేటాయించాం. ఇందిరమ్మ కమిటీ పరిశీలన తర్వాత గెజిటెడ్ ఆఫీసర్ పరిశీలించి మున్సిపల్ కమిషనర్లకు, ఎంపీడీవోలకు ఆ జాబితాను అందజేశారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. నిబంధనల ప్రకారం లేకుంటే పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం. అవసరమైతే వాటిని రద్దు చేస్తాం.

-జగదీశ్వర్‌రెడ్డి, ఆర్డీవో

బిల్లులు స్వాహా .. చర్యలు తీసుకోవాలి

సైదాబాద్ మే 25: సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్ లో ఎలాంటి పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేసిన జీహెచ్ఎంసీ అధికారులపై, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఐ ఎస్ సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానికంగా సీసీ రోడ్డు నిర్మాణం చేసినట్లు రికార్డులు సృష్టించి పది లక్షల రూపాయలు స్వాహా చేసి అవినీతికి పాల్పడ్డ వారిపై శాఖాపరమైన విచారణ జరిపించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించాలని ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరారు. సింగరేణి కాలనీ లో ప్రజలకు తాగునీటి కష్టాలను, పారిశుధ్య ఇబ్బందులను తొలగించడంలో అధికారులు పట్టించుకోవడంలేదని, కేవలం అవినీతికి పాల్పడడానికి వారు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదానం చేస్తున్న పలువురు

ఆర్కే పురం, మే 25 : రక్తదానం ప్రాణదానంతో సమానమని సనాతన ధర్మ వారధి వ్యవస్థాపకుడు కల్వ కొలను శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో శ్రీరామచంద్ర మూర్తి పాల్గొని రక్తదానం చేసి యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని సూచించారు. రక్తదానంతో ఎంతోమందిని కాపాడిన వారం అవుతామని అన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యకర్తలు, అనుసంధానకర్తలు, దాతలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల పింఛన్ పెంచాలి

అంబర్‌పేట, మే 25 : స్టేట్ బ్యాంక్ అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ సమావేశం ఆదివారం స్థానికంగా జరిగింది. అసోసియేషన్ ప్రతినిధి ఉప్పు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో 1995 నుండి పింఛను పెంపు, భీమా సౌకర్యం తదితర అంశాలపై చర్చించారు. కేంద్ర ప్రభు త్వం వెంటనే ఈ విషయాలపై స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రధాన కార్యదర్శి సి.ఎస్. ప్రసా ద్, అధ్యక్షుడు డా.అనంత కృష్ణ, సంయుక్త ప్రధాన కార్యదర్శి వి.సోంబాబు తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి కె. రోహిణిరావు, లక్ష్మారెడ్డి, కృష్ణమురళీ, ములినిరెడ్డి, రవికుమార్, రామకోటేశ్వర్ రావు, సాయిరెడ్డి, వి.కె. తివారి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ అఖిల భారత విశ్రాంత ఉద్యోగులు